# ఓన్లీ వన్

-శైలజా రాంషా

"రశ్మీ! రశ్మీ! క్విక్ పద, హాస్పిటల్‌కు వెళ్లాలి. అమ్మని జాయిన్ చేశారట" అని తొందరగా బయలుదేరదీసాడు మాధవ్.

"అమ్మకేమైంది నాన్నా! ఒంట్లో బాగోలేదా?" కళ్లనిండా నీళ్లతో అడుగుతున్న రశ్మిని దగ్గరకు తీసుకుని "ఏం లేదమ్మా! అమ్మకేం కాదు. మనకో బుజ్జి పాపాయిని ఇవ్వడానికని హాస్పిటల్‌లో ఉంది. అంతే!" అని సముదాయించి రశ్మిని తీసుకుని బయలుదేరాడు మాధవ్.

లేట్ ప్రెగ్నెన్సీ అవడంవలన, చాలా జాగ్రత్తగా ఉండాలంటే ఆరునెలల నుండి వాళ్ళ అమ్మ దగ్గరే ఉంది కాంతి. ఎలా అవస్థ పడుతుందో ఏమో? తనసలు ఇప్పుడు పిల్లలేంటి, వద్దనే అన్నాడు. కానీ తనే పట్టుదలగా రెండో బిడ్డ కోసం ఎదురుచూసింది. ఈ తొమ్మిది నెలల్లో తను పడే అవస్థ ఎవరికీ తెలియకూడదని వాళ్ళ అమ్మ దగ్గరికి వెళ్లిపోయింది. తరచుగా వచ్చి చూసి బాధపడవద్దని కూడా చెప్పింది. తన మనసులో ఏముందోగానీ ఏ ప్రమాదమూ వాటిల్లకుండా సుఖ ప్రసవం జరిగి కాంతి క్షేమంగా ఇంటికి చేరితే అంతే చాలు. ఆలోచనల్లోనే హాస్పిటల్ ముందు కారు ఆపి రశ్మిని తీసుకుని లోపలకు నడిచాడు మాధవ్. కాంతి నాన్నగారు ఎదురొచ్చారు.

"కాంతికి ఎలా వుంది మామయ్యా! మీరేంటి అలా వున్నారు?" అని అడగగానే-

"ఫర్వాలేదన్నారు బాబూ. ఇంకో గంట పట్టవచ్చునన్నారు" అంటూ భుజం తట్టి లోపలికి తీసుకువచ్చారు.

లోపలికి వెళ్లిన రశ్మి, మాధవ్‌లకు కాంతి అమ్మగారు లేబర్ రూమ్ ముందు దిగులుగా కూర్చుని కనబడ్డారు. "అమ్మమ్మా!" అని దగ్గరకు వెళ్లిన రశ్మిని దగ్గరకు తీసుకుని ప్రక్కన కూర్చోబెట్టుకున్నారు.


రెండుగంటల నిరీక్షణ తరువాత లేబర్ రూమ్‌లో నుండి పసిపాప ఏడుపు వినిపించింది. నర్స్ బయటకు వచ్చి "పాప పుట్టిందండీ" అని హడావుడిగా లోపలకు వెళ్లిపోతుంటే "కాంతి ఎలా వుంది?" అనడిగాడు మాధవ్. "ఆమె కూడా బాగున్నారు" అని చెప్పి లోపలకు వెళ్లిపోయింది.

అరగంట తరువాత పువ్వులా వున్న పాపని తీసుకొచ్చి చూపించింది నర్స్. మగతగా ఉన్న కాంతిని వార్డుకి షిఫ్ట్ చేసారు. డాక్టర్ బయటకు వచ్చి మందులు రాసిచ్చి "కాంతి చాలా నీరసంగా వుంది. ఆపరేషన్ అవసరమవుతుందేమో అని అనుకున్నాం కానీ ఇంకేమీ కాంప్లికేషన్స్ లేకపోవడంవలన నార్మల్ డెలివరీ అయింది. ఇంక ప్రాబ్లమ్ ఏమీలేదు" అనగానే అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

ఆ రోజుకి ఇంటికి తిరిగివచ్చినా అప్పుడే అరవిరిసిన పువ్వులా వున్న పాప మొహం, నలిగిపోయి సొమ్మసిల్లినట్లుగా వున్న కాంతి మొహం మాధవ్‌ని నిద్ర పోనివ్వలేదు. ఎంత చెప్పినా వినకుండా రెండవసారి గర్భవతైంది కాంతి. ప్లానింగ్ పిల్స్ లాస్ట్ ట్రిప్‌లో భీమిలీ సముద్రంలో పడేసింది. ఇప్పుడు ఎంత అవస్థ పడింది? కాంతికేదైనా అయితే తనను తను క్షమించుకోగలిగేవాడా? ఇప్పుడు అంతా బాగానే వుందిగా! అని అనుకున్నా తను శారీరకంగా ఎంత బాధపడిందో తనకు తెలుసు. పిచ్చి పిచ్చి కలలతో, ఊహలతో, ప్రసవ సమయంలో ఏ వార్త వినాల్సి వస్తుందోనని చాలా భయపడ్డాడు. పరోక్షంగా కడుపునబడ్డ చిన్నదాన్ని కూడా విసుక్కునేవాడు. క్షేమంగా ప్రసవం అయితే చాలునని ఎన్నో దేవుళ్ళకు మొక్కుకునేవాడు. ఈ నీరసం తగ్గి మళ్ళీ హుషారుగా ఎప్పుడు ఇంట్లో తిరుగుతుందో ఏమో! చాలా స్ట్రిక్ట్‌గా 'ఓన్లీ వన్' అని అనుకునే రశ్మిని కన్నారు. సడెన్‌గా 10 సంవత్సరాల తరువాత ఈ ఆలోచన ఎందుకు కలిగిందో తెలియదు. డెలివరీ అయితేగానీ తన నిర్ణయం వెనుక కథ చెప్పనంది. ఒక పెళ్లయిన యువతిగా మరో బిడ్డను కనాలనుకోవడం తప్పుకాదని వాదించేది. ఏది ఏమైనా కాంతి కోరిక తీరింది అంతేచాలు అనుకుంటూ నిద్రలోకి ఒరిగాడు మాధవ్.

★★★

డిశ్చార్జ్ అయి ఇంటికి వస్తుంటే ఇద్దరినీ పిలిచి డాక్టర్ ప్రత్యేకంగా చెప్పింది బలమైన ఆహారం, మందులు వాడమని, రెగ్యులర్‌గా వచ్చి చెకప్



చేయించుకోమని, మూడునెలలు బరువు పనులు చేయకుండా రెస్ట్‌గా వుండాలని. అన్నీ విని డాక్టర్‌కి థాంక్స్ చెప్పి బయటకు వచ్చారు దంపతులిద్దరూ.

పాపని ఒళ్ళో పెట్టుకుని మంచంమీద కూర్చుంది కాంతి. మొహంలో నీరసం కనిపిస్తున్నా నలుగు పెట్టి స్నానం చేయించారేమో పట్టుచీరలో మెరిసిపోతోంది కాంతి. రశ్మి తల్లి దగ్గరే కూర్చుని పాప గులాబీ బుగ్గలనీ, వత్తయిన నల్లని జుట్టుని ఏదో అద్భుతంలా పరికించి చూస్తుంటే "చిన్నప్పుడు నువ్వు కూడా ఇలాగే ఉండేదానివి తెలుసా?" అన్న కాంతి మాటలకి రశ్మి తల ఎత్తి "నిజంగానా అమ్మా?" అని అడిగింది.

"నిజంరా. ఇన్‌ఫాక్ట్ నువ్వు ఇంకా బాగుండేదానివి" అంటూ తల ఎత్తి చూసిన కాంతికి ఎదురుగుండా మాధవ్, అతని తమ్ముడు రాజీవ్, తోడికోడలు రమ కనిపించారు.

"లోపలికి రండి" అని ఆహ్వానించింది కాంతి.

"నాన్నా! పాప నిద్రలో నవ్వుతోంది తెలుసా? పిన్నీ! చూద్దువుగాని రా" అని రమని మంచం దగ్గరకు లాక్కెళ్లింది.

"నాకివ్వండి అక్కా" అని పాపని తీసుకుని పక్కమీద పడుకోబెట్టి, "కొంచెం సౌకర్యంగా కూర్చోండి" అని దిళ్ళు సర్దింది రమ. రాజీవ్ కూడా పాపని చూసి "రశ్మి చిన్నప్పుడు ఇలానే ఉండేది కదా వదినా!" అంటూ దగ్గరికి మోడా లాక్కుని కూర్చున్నాడు.

"వదినా! ఒక్క మాట అడగనా? ఏమీ అనుకోవు కదా" అనగానే-

"అడుగు రాజీవ్. నన్నేదైనా అడగడానికి నువ్వు పర్మిషన్ అడగాలా?" అనంది కాంతి.


"బయటకు వెళ్లి ఆడుకో రశ్మీ" అని దాన్ని బయటకు పంపి వదిన వైపు తిరిగాడు రాజీవ్.

"మీ ముచ్చట్ల మధ్య మేం ఉండవచ్చా?" అని నవ్వుతూ అడిగాడు మాధవ్.

"ఉండన్నా. నువ్వు లేకుండా ఎలా?" అన్నాడు రాజీవ్.

"తొందరగా అడగవోయ్. చాలా సస్పెన్స్‌గా ఉంది" అంది కాంతి.

ఒక నిముషం మౌనంగా ఊరుకుని "వదినా! నిన్ను బాధ పెట్టాలని కాదు. నీ ఆరోగ్యం సహకరించదని తెలిసీ, ఇప్పుడు ఈ బిడ్డని ఎందుకు కన్నావు? వన్ ఆర్ నన్ అని అనేదానివి కదా. అదీగాక ప్రెగ్నెన్సీ గూర్చి మాకెవ్వరికీ తెలియనీయవద్దన్నావుట. ఒంట్లో బాగుండలేదు అంటే వద్దామని అనుకున్నాం. వెళ్లి చూస్తాను అంటే తనని డిస్ట్రబ్ చేయవద్దంది అన్నాడు అన్న. సడెన్‌గా హాస్పిటల్‌లో ఉన్నావనీ, పాప పుట్టిందని తెలియగానే అందరం ఆశ్చర్యపోయాం. నువ్వు ఇలాంటి డెసిషన్ తీసుకుంటావని, దాన్ని ఇంత రహస్యంగా అమలు చేస్తావని అనుకోలేకపోయాం. దీని వెనుక కారణం ఏమిటి?" అడిగాడు రాజీవ్.



ఆలోచనలో పడ్డట్టుగా అయిదు నిముషాలు ఆగి మొదలుపెట్టింది కాంతి.

"మొదట రెండవ భాగానికి జవాబు చెబుతాను. ప్రెగ్నెన్సీ టైములో ఈ బిడ్డ గురించిన వాదోపవాదాలు వినడం నాకిష్టం లేకపోయింది. లేట్ ప్రెగ్నెన్సీ అవడం వలన అయితేనేం, నా అజాగ్రత్త వలన అయితేనేం నా ఆరోగ్యం కొంతవరకు దిగజారింది. దానికి కూడా ఈ బిడ్డే కారణం అని దూషిస్తారేమోనని భయపడ్డాను. అందువల్లనే ఎవ్వరికీ తెలియనివ్వద్దన్నది. ఇంక దీన్ని కనడానికి కారణం మాత్రం వేరే వుంది. ఒక్కొక్కరూ ఒక్కొక్క అనుభవాన్ని ఒక్కొక్క దృష్టితో చూస్తారు. ఒక వారం రోజులు నువ్వు రాకపోతే ఇంట్లో అందరూ డిస్టర్బ్ అయిపోతారు. రశ్మి అయితే ఏకంగా ఏడుస్తుంది బాబయ్య రాలేదని. విశ్వ మానవ సౌభ్రాతృత్వం, పాప్యులేషన్ ఎక్స్‌ప్లోషన్ అని ఏవో ఆదర్శాలతో ఒక్క బిడ్డ చాలని అనుకున్నాను. కానీ మనసు విప్పి మాట్లాడడానికి, స్వేచ్ఛగా తగవులాడుకోవడానికి ఏదైనా తగవు శృతి మించినా మళ్ళీ హృదయానికి హత్తుకోవడానికి రక్త సంబంధీకులు ఉండాలి. నీకు గుర్తుందో లేదో. ఒకసారి నీకు జ్వరం వస్తే దగ్గరుండి బ్లడ్ టెస్టులన్నీ చేయించి టైఫాయిడ్ అని తెలిసాక మందులువేసి డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి నీ దగ్గరే గడిపారు మీ అన్న. మరి రశ్మికేదైనా అయితే, దానికంటూ ఎవరైనా వున్నారా? పిలిస్తే పలకడానికి, పరుగెత్తుకు రావడానికి తోడబుట్టినవాళ్ళు ఉండక్కర్లేదా?

భూమికి ఆవలవైపు వున్నా ఏకోదరులైతే ఒక్క ఫోన్ కాల్ దూరమేగా, ఎలా వున్నావే అని ఫోన్ వస్తుంది. జబ్బో, జ్వరమో అయితే, రాగలిగిన దూరమైతే తప్పకుండా పరుగెత్తుకు వస్తారు. ఎన్ని మనస్పర్థలు ఉండనీ, పిలవగానే పలికేదే తోడబుట్టినవాళ్ళు. అది ఒంటరిగా ఉండకూడదని నా కోరిక. పాలవ్వనీ, నీళ్ళవ్వనీ కలసి పంచుకుంటారు. సుఖాలైనా, దుఃఖాలైనా సమానంగా అనుభవిస్తారు.

ఒక్కొక్క రోజు సాటి పిల్లలతో కలవకుండా మౌనంగా ఉండిపోవడం వెనుక దాని ఒంటరితనం నాకు మాత్రమే కనబడుతుంది. స్కూలులో తరిగిపోతున్న చురుకుదనం, తన లాగే మైల్డ్‌గా ఉండే ఫ్రెండ్స్‌ని ఎంచుకునే విధానం. ఇవన్నీ నన్ను చాలా భయపెట్టాయి. జీవితానికి చదువు, డబ్బు మాత్రమే ముఖ్యం కాదుగా. జబ్బుకి, జ్వరంకి మాత్రమే కాదు, ఏ విజయాన్ని పంచుకోవడానికో, ఏ సంతోషాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికో మనకంటూ ఒకరుండాలి. అందుకే కష్టమైనా ఇంకొక బిడ్డని కనాలి అని అనుకున్నాను.

ఇంక పెద్దమ్మ పిల్లలు, పినతండ్రి పిల్లలు అంటావా! ఈ పరుగులు తీసే ప్రపంచంలో కజిన్స్‌కి చోటు వుందా? మావాడికి చెల్లెలి తరువాతే ఎవరైనా? అనే తల్లీదండ్రుల స్వార్థంలో తోబుట్టువుల ప్రేమ ఎక్కడ దొరుకుతుంది? నాకింకొక సందేహం, అసలు రశ్మి మీ పిల్లలని ప్రేమించడానికి, దానిలో అసలు ఎవరినైనా ప్రేమించాలనే భావన ఉందా? ఛారిటీ ఎలా ఇంటి నుండి ప్రారంభమవ్వాలో, అలాగే ప్రేమించడం అనే భావన కూడా పెరగాలి. ఇద్దరు పిల్లలున్న కుటుంబంలో చూడు, కలసి పెరుగుతారు, ఆడుకుంటారు, కొట్టుకుంటారు, తగవులాడుకుంటారు. అంతలోనే ఒకటవుతారు. వేరే పిల్లలతో తగవు వస్తే ఒకరినొకరు సపోర్ట్ చేసుకుంటారు. ఒకరి సక్సెస్‌తో మరొకరు ఆనందం పొందుతారు. అన్నలు తెచ్చే గిఫ్ట్‌ల కోసం ఎదురుచూసే చెల్లెళ్ళు, అక్కల పట్టు పరికిణీలు కట్టుకోవాలని సంబరపడే చెల్లెళ్ళు, సింగిల్ చైల్డ్ కుటుంబాలలో ఎక్కడున్నారూ? అన్నీ ఫ్రెష్, లేదా యూజ్ అండ్ త్రో. ఇదంతా నా స్వార్థం కప్పిపుచ్చుకోవడానికే అని నువ్వంటే నేనేమీ చెప్పలేను. అంతెందుకు, నిన్ను నువ్వే నిజాయితీగా ప్రశ్నించుకో, నీ దృష్టిలో వదినకి, అక్కకి తేడా లేదా? అబ్సొల్యూట్లీ దేరీజ్ నో కంపారిజన్. అక్క అక్కే, అక్క తరువాతే ఎవరైనా అంటావు. రశ్మికి కూడా అలాంటి చెల్లెలో, తమ్ముడో ఉండాలని అనుకోవడంలో తప్పులేదు కదా. ఎంతో ఆలోచించి, అవసరం అనిపించి ఈ బిడ్డకు జన్మనిచ్చాను. ఇంక డెలివరీ టైములో నాకేదైనా అయితేనో అని నీ సందేహంకదూ. మీరందరూ ఉండగా రశ్మికేం లోటు? ఈ నిర్ణయం వెనుకనున్న నా మనసిది" అని ముగించి అలసటగా పక్క మీదకు వాలింది కాంతి.

అప్పటిదాకా ఆరోగ్యం గురించి పట్టించుకోలేదని కోపంగా వున్న మాధవ్ మొహం ప్రసన్నంగా మారడంతో కాంతి మొహం సంతృప్తిగా మెరిసింది. కొత్తగా వచ్చిన గెస్ట్‌ని గుండెలకి హత్తుకుని ముద్దు పెట్టుకుంది. వదిన ఇచ్చిన వివరణ నచ్చిన రాజీవ్ చిరునవ్వుతో లేస్తూ ఎవరూ చూడకుండా రమ కేసి చూసి 'రెడీ కావోయ్ ఇంకో బిడ్డ కోసం' అన్నట్లు కొంటె చూపు విసిరాడు. అంగీకార సూచకంగా రమ మొహం మీద విరిసిన నవ్వులో రాజీవ్ చూపు విలీనమైంది.

★



# మారిన లైఫ్‌స్టయిల్

'వంశీ'లో మహేష్‌బాబు సరసన నటించిన నమ్రతా శిరోద్కర్ ఇప్పుడు త్రిముఖ వ్యూహం అనుసరిస్తున్నట్టుంది. ఆ సినిమా ఆమెకంత పేరు తీసుకురాకపోయినా ఇతర భాషా చిత్రాల్లో అవకాశాలకు నాంది పలికినట్టయింది. ఖాళీ సమయాల్లో తన అందానికి మరిన్ని మెరుగులు దిద్దుకుంటూ ఇటు తమిళం, అటు బాలీవుడ్ నిర్మాత, దర్శకుల దృష్టిలో పడింది. తమిళ హీరో విజయ్ సరసన ఆమె ఓ చిత్రంలో నటిస్తోంది. 'తెలుగులో అవకాశం వస్తే నటించడానికి సిద్ధంగా ఉన్నాను' అని చెప్పే నమ్రతాకి ఎవరి పిలిచి ఛాన్స్ ఇస్తారో చూద్దాం. ఆమె నటిస్తున్న తమిళ చిత్రం హిట్ అయితే అక్కడ కూడా అవకాశాలు బాగానే ఉంటాయంటోంది. ఈ సినిమా కోసం ఆమె తన లైఫ్‌స్టయిల్‌లో మార్పులు చేసుకుంటోంది. ఈ మార్పులు ఆమె జీవితాన్ని మారుస్తాయేమో చూద్దాం.

